క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెదకూరపాడు: మండల పరిధిలోని కాశిపాడు గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద ఈ నెల 6న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ రహీం బాషా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేయబడునన్నారు. మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి: ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే దానిపై అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం పేరుతో పట్టణంలోని 9వ వార్డులో శుక్రవారం పర్యటించారు. సమస్యలు తెలుసుకొని వాటిని మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి, నాయకులు యెల్లినేడి రామస్వామి, బలిజే పల్లి సురేష్‌కుమార్, వక్కంటి అజయ్ ఉన్నారు.

వైద్య విద్యార్థులపై పోలీసుల దాడి దారుణం

సత్తెనపల్లి: వైద్య విద్యార్థులపై పోలీసుల దాడి దారుణమని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్య విద్యార్థుల పట్ల కర్కశంగా వ్యవహరించడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువ వైద్యులను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మెడికల్ కళాశాలల్లో సీట్లు పెరగనీయకుండా అడ్డుకోవడం వైద్య విద్య పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపు అవగత మవుతుందన్నారు. మెడికల్ కాలేజీలను తమ వాళ్లకు కట్టబెట్టే దిశగా ప్రభుత్వ పెద్దలు పావులు కదుపుతున్నారని విమర్శించారు. తక్షణమే వైద్య విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజధానికి రెండో విడత పూలింగ్ అవసరమా...?

సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు



అమరావతి: కూటమి ప్రభుత్వం రెండో విడత భూ సమీకరణ ద్వారా 44 వేల ఎకరాలు రైతుల నుండి తీసుకోవాల్సిన అవసరం ఉందా అని సీపీఎం అమరావతి మండల కార్యదర్శి బి.సూరిబాబు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజధానికి 33 వేల ఎకరాలు తీసుకొని నేటికీ రైతులకు ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని, భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయకుండా మరో విడత భూ సమీకరణ చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు రైతుల ఆందోళనను పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కార్పొరేట్ సంస్థలకి కారుచౌకగా సారవంతమైన భూములు ఇవ్వడం అన్యాయమన్నారు. అమరావతి, తాడికొండ ప్రాంతాల్లో వాణిజ్య పంటలకు అనువైన భూముల్ని తీసుకుంటే భూమి మీద బతికే వ్యవసాయ కూలీలు, రైతులు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. రైతుల సందేహాలకు సమాధానాలు ఇవ్వకుండా గ్రామ సభలు నిర్వహించడం దారుణమన్నారు.

సత్తెనపల్లిలో బాలుడిపై వీధికుక్క దాడి



సత్తెనపల్లి: బాలుడిపై వీధికుక్క విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన సత్తెనపల్లిలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 12వ వార్డు వీరాంజ నేయనగర్‌లో దేశినేని అశోక్ అనే నాలుగేళ్ళ బాలుడిపై ఓ కుక్క దాడి చేసింది. కుక్క దాడి చేయడంతో బాలుడు అశోక్ కేకలు పెట్టి ఏడవగా స్థానికుల అప్రమత్తమై కుక్కను తరిమి కొట్టారు. అశోక్ శరీరంపై గాయాలు కావడంతో క్షతగాత్రుడి తల్లి దేశినేని అంకాలమ్మ బాలుడిని తన భుజాలపై వేసుకొని స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీసింది. ఆరు గాట్లు పడినట్లు గుర్తించారు. ప్రాణాపాయం తప్పటంతో తల్లిదండ్రులు అంకాలమ్మ, బేల్దారి మేస్త్రి దేశినేని భాను ఊపిరి పీల్చుకున్నారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ కనెక్షన్లు ఇస్తారా..!

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు

- గతేడాది ఇదే సీజన్‌లో నూతన కనెక్షన్ల కోసం వేసిన విద్యుత్ స్తంభాలు
- తీగలు బిగించకపోవడంతో వర్షాలకు కూలిన స్తంభాలు
- ఏడాది గడిచినా అలానే పడి ఉన్న వైనం



తీగలు లేని విద్యుత్ స్తంభాలు



గాలి వానలకు కిందపడిపోయిన స్తంభాలు

అచ్చంపేట: రైతులపై కపటి ప్రేమను ఒలకబోసే కూటమి సర్కార్ కనీసం రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో కూడా విఫలమైంది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు పెట్టుబడిగా ఇస్తానన్న రూ.20 వేలు ఇవ్వడానికి సవాలక్ష ఆంక్షలు పెట్టి మీనమేషాలు లెక్కిస్తోంది. రైతులు అష్టకష్టాలు పడి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుని సుమారు ఏడాదిన్నర గడచింది. పేర్లు నమోదు చేసుకున్న రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలంలో ఇలా...

మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం పెదపాలెం, అచ్చంపేట గ్రామాలకు చెందిన కొంత మంది రైతులు గత ఏడాది మార్చిలో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. అలా నమోదు చేసుకున్న రైతులకు ఏప్రిల్, మే నెలల్లో స్తంభాలు వేసి తీగలు లాగి, ట్రాన్స్‌ఫార్మర్స్ బిగించి జూన్‌లో పంట కాలం మొదలయ్యే నాటికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. అయితే విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు మాత్రమే వేసి వదిలేయడంతో గత జూన్‌లో కురిసిన వర్షాలకు సుమారు 15 స్తంభాలకు పైగా విరిగిపోయాయి. విరిగిపోయి ఏడాది గడిచినా వాటిని పునరుద్ధరించలేదు. రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లు పూర్తయ్యాయి. మళ్లీ ఈ ఏడాది వ్యవసాయ సీజన్ కూడా వచ్చింది. విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో గతేడాది సాగు నీరు లేక రైతులు ఖరీఫ్, రబీ పంటలను కోల్పోయారు. పత్తి, మిర్చి పంటలను పూర్తిగా కోల్పోయి నష్టాలలో కూరుకుపోయారు. విద్యుత్ కనెక్షన్లు ఇస్తారన్న నమ్మకంతో రైతులు వేలాది రూపాయలు వెచ్చించి బోర్లు, బావులు కూడా తవ్వుకున్నారు.

అదనపు భారం

ఈ ప్రాంత రైతులకు సాగర్‌జలాలు అందవు. పులిచింతల ప్రాజెక్టు నుంచి కృష్ణా, డెల్టా రైతులకు తప్ప ఈ ప్రాంత రైతులకు నీళ్లు రావు. బోర్లు, బావులపైనే ఆధారపడి పంటలు పండించుకోవాలి. గత ఏడాది వర్షాలు సకాలంలో పడి, ప్రాజెక్టులు నిండి, భూగర్భ జలాలు వృద్ధి చెందినప్పటికీ, వేలాది రూపాయలతో వేసుకున్న బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో రైతులు డీజిల్ ఇంజన్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెరిగిన పెట్టుబడులతో తల్లడిల్లుతున్న రైతులకు డీజిల్ ఇంజన్ల ఖర్చు అదనపు భారమైంది.

ఏడాది గడిచినా పునరుద్ధరించలేదు

రైతులకు వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చేందుకు విద్యుత్ శాఖాధికారులు గత ఏడాది విద్యుత్ స్తంభాలు వేశారు. వెంటనే తీగలు లాగినట్లయితే ఒక దానికొకటి సపోర్టుగా ఉండి వేసిన స్తంభాలు నిలబడేవి. కానీ వెంటనే తీగలు లాగకపోవడంతో వర్షాలు, గాలులకు కొన్ని స్తంభాలు కిందపడి విరిగిపోయాయి. ఏడాది గడిచినా ఇప్పటికీ విరిగిన స్తంభాలు అలాగే ఉన్నాయి. వాటిని పునరుద్ధరించడం గానీ, రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం గానీ జరగలేదు.

> **తప్పనిసరిగా కనెక్షన్లు ఇస్తాం**
>
> విద్యుత్ స్తంభాలు రాకపోవడంతో విరిగిన స్తంభాలను తిరిగి వేసి తీగలు లాగలేకపోయాం. మరో వారం రోజులలో విరిగిన స్తంభాలన్నింటినీ పునరుద్ధరించి, తీగలు లాగి రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం. ఈ సీజన్‌లో తప్పనిసరిగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం.
>
> – శివకోటిరెడ్డి, ఏఈ, విద్యుత్ శాఖ, అచ్చంపేట

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ అధ్యక్షతన ఉపాధి హామీ పథకంపై సమీక్ష, వివిధ సంక్షేమ కార్యక్రమాలు, శాఖల ప్రగతి తదితర విషయాలను చర్చించనున్నట్లు తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఫ్లోరోసిస్ వ్యాధి సర్వేపై శిక్షణ

క్రోసూరు: ఫ్లోరోసిస్ వ్యాధి సర్వేపై ఆరోగ్య విస్తరణ అధికారులకు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు, ఆరోగ్య కేంద్రం సిబ్బందికి జిల్లా కన్సల్టెంట్ ఎన్సీడీ ఆధ్వర్యంలో శుక్రవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ ఫ్లోరైడ్ భూగర్భ జలాలు, నదీ జలాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, టీ, కాఫీ, పారిశ్రామిక వ్యర్థాలు, టూత్ పేస్ట్‌లలో ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఫ్లోరోసిస్ రెండు రూపాల్లో వస్తుందని.. మొదటిది డెంటల్ ఫ్లోరోసిస్.. ఇది ప్రధానంగా పిల్లలను ప్రభావితం చేస్తుందన్నారు. ఇందులో ఆరేళ్లలోపు పిల్లల దంతాలు పసుపు రంగులోకి మారటం ప్రారంభమవుతుందన్నారు. రెండవది స్కెలిటల్ ఫ్లోరోసిస్.. ఇది శరీరంలోని కీళ్లను ప్రభావితం చేస్తుందన్నారు. 6 నుంచి 16 సంవత్సరాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఫ్లోరోసిస్ టెస్టులు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు షాద్, సిరిచందన, రాంబాబునాయక్, ఆరోగ్య విస్తరణాధికారులు శిఖా శ్యాంసన్, పి.వెంకట్రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

అసమాన ప్రజ్ఞావంతుడు రోశయ్య



రోశయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: దేశంలోనే అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన రాజకీయ నాయకుడు, అసమాన ప్రజ్ఞావంతుడు డాక్టర్ కొణిజేటి రోశయ్య అని మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా సేవలందించిన రోశయ్య జయంతిని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా రోశయ్య ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు చౌటా శ్రీనివాసరావు, కొల్లిపర కాశీ విశ్వనాథం, బచ్చు కొండలు, అన్నం బాలసుబ్రమణ్యం, దేవరపల్లి కాశి, పోతుగంటి నరసింహారావు, పెరుమాళ్ళ లక్ష్మీశివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ముప్పాళ్ళ: మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బొల్లవరం అడ్డరోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా టాటామినీ ట్రక్కులో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఫిరంగిపురం మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన మొహిద్దీన్‌పీరా అనే వ్యక్తి ఇళ్ల వెంబడి తిరిగి రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తూ ఉంటాడని విచారణలో వెల్లడైనట్లు ఎస్సై తెలిపారు. బియ్యం ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని మొహిద్దీన్‌పీరాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేవాలయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయం రాజగోపురం తలుపు బుధవారం రాత్రి పడిపోవడం దురదృష్టకరమని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఎంతో పేరు ప్రఖ్యాతులున్న అమరేశ్వరాలయంలో ఇలాంటి ఘటన జరగటం బాధాకరమన్నారు. పురాతన కాలం నాటి దేవాలయం చెక్కుచెదరకుండా ఉంటే గాలిగోపురం కట్టి సుమారు 10 సంవత్సరాలకే తలుపులు పడిపోవడం ఆ నాటి అధికారుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ఆ సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఇప్పటికైనా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అధికారులు పని చేయాలని నిర్లక్ష్య ధోరణి వదిలి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

అనాథాశ్రమంలో వైద్య శిబిరం



వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పాల్‌రవి, సిబ్బంది

రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధిలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ పాల్‌రవి పాల్గొని 20 మంది వృద్ధులకు, 50 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ ఉన్న వాళ్లకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావు, సీహెచ్‌వో ప్రియ, ఏఎన్ఎమ్ శారదా, ఆశా కార్యకర్తలు సుజాత, మరియమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(రామాపురం కాలనీ)లో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. పాఠశాల మూసివేత దశ నుంచి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు కూడా గత ఉపాధ్యాయులు మాదిరిగా పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. బదిలీపై వెళుతున్న మువ్వా సురేష్, తోకల అచ్చయ్యలను మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, గ్రామస్తులు, ఎస్ఎంసీ చైర్మన్ వీరారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: అంకిత భావంతో అహర్నిశలు శ్రద్ధతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గ్రామస్తులు ఎప్పటికీ మరచిపోరని బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని బలిజేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి, మస్తాన్‌వలిలు ఎనిమిదేళ్లు కష్టపడి పనిచేశారు. బదిలీపై వెళుతున్నందున గ్రామస్తులు వారిని ఘనంగా సత్కరించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌతుకట్ల జ్యోతి, మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ ప్రసాద్, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతి గర్వించే నేత వంగవీటి



సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న కాపుసంఘ నాయకులు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: తెలుగుజాతి గర్వించే నేత దివంగత స్వర్గీయ మాజీ శాసనసభ్యుడు వంగవీటి మోహన్‌రంగా అని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. టీడ్ర యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావు ఆధ్వర్యంలో రంగా జయంతి వేడుకలు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో, లక్కరాజుగార్లపాడు సెంటర్‌లో రంగా విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన యోధుడు రంగా అని అన్నారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి, చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, రమావత్ కోటేశ్వరరావునాయక్, షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, పెద్దింటి వెంకటేశ్వర్లు, వల్లెం నరసింహారావు, శిరిగిరి వెంకట్రావు, గుజ్జర్లపూడి సతీష్, లోకా మాధవ, గద్దం వెంకటేశ్వర్లు, తుమ్మల వెంకటేశ్వరరావు, ముక్తార్, ఘోర బుడే, మొహిబ్, గుజ్జర్లపూడి చంటి, గుజ్జర్లపూడి కృపారావు, ఉల్లంగుల ప్రసాద్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లక్కరాజుగార్లపాడు సెంటర్‌లో...

పట్టణంలోని లక్కరాజుగార్లపాడు సెంటర్‌లో రంగా జయంతి వేడుకలు హరి మిత్రమండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహాని కి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి పేదలకు పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరి మిత్రమండలి సభ్యులు తదితరులు ఉన్నారు.

వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద ...

పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద రంగా జయంతి వేడుకలు బి.సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, టీడీపీ రాష్ట్ర నాయకులు చౌటా శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలిలు హాజరై రంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి: దివంగత కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని మల్లాది గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపా వాసు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా పేదలకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాపు నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు స్థానిక ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్‌లో కాపుసంఘ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, కాపుసంఘ నేత గంధం కోటేశ్వరరావు, ప్రసాదు, అన్నం శ్రీనివాసరావు తదితరులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కాపుసంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎర్ర బ్యాడ్జీలతో నిరసనలో ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సభ్యులు

సత్తెనపల్లి: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఏపీ పీటీడీ సత్తెనపల్లి డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌బీకె సాహెబ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సత్తెనపల్లి డిపోలో ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సభ్యులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సులు ఆర్టీసీ ద్వారా నిర్వహించాలని, ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. డిపో సెక్రటరీ భాస్కర్, ట్రెజరర్ జవహర్, సీసీఎస్ డెలిగేట్ యేసయ్య, డిపో అధ్యక్షుడు డీఎస్‌డీ హుస్సేన్, జిల్లా కమిటీ సభ్యులు, యూనియన్ సభ్యులు ఉన్నారు.

అల్లూరి ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్



సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయంలో...



అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పీడీఎఫ్ నేతలు



సత్తెనపల్లి టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో...

సత్తెనపల్లి: రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చూపిన ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకమని మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అల్లూరి జయంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశం కోసం బ్రిటిష్ వారితో అలుపెరగని పోరాటం సాగించి ప్రాణాలర్పించిన ధైర్యశాలి అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి పి.రాధాకృష్ణ, రెవెన్యూ అధికారి వెంకట అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, ఇండోర్, ఔట్‌డోర్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో

ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన అల్లూరి సీతారామరాజు యువతకు ఆదర్శమని స్వామి వివేకానంద చైతన్య భారతి సభ్యుడు జేపీఎస్ శాస్త్రి అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని ఆయన విగ్రహం వద్ద శుక్రవారం స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద స్వామి వివేకానంద వర్ధంతిని నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. స్వామి వివేకానంద చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్, సభ్యులు తదితరులు ఉన్నారు.

టీచర్ ఐటీఐ మస్తాన్ కళాశాలలో...

పట్టణంలోని టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి, స్వామి వివేకానంద చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు శ్రీలత, ట్రైనర్ శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయాలు కొనసాగించాలి

పెదకూరపాడు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను నేటి తరం కొనసాగించాలని విజయ విద్య విహార్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు నోముల కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పెదకూరపాడు కచేరి సెంటర్‌లో పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పీడీఎఫ్) ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా కవి దర్శి శేషారావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గుత్తా వెంకటేశ్వర్లు, కాల్వ అప్పారావు, కరిముల్లా, సంజీవరావు, రామనాథం, వెంకటేశ్వర్లు, నరసింహారావు, శ్రీను, రత్నబాబు, జానీ, సైదా పాల్గొన్నారు.

•నేడు విద్యుత్ చార్జీలపై ధర్నా

పెదకూరపాడు: విద్యుత్ చార్జీలు సర్ చార్జీలు పెంపుపై పెదకూరపాడు విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నేటి ధర్నాను జయప్రదం చేయాలని మండల సీపీఐ కార్యదర్శి పఠాన్ నాగుల మీరా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్లు నిలువుదల చేయాలని డిమాండ్ చేశారు.